క్లుప్తంగా

మీడియా ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, తదితరులు

మహారాణిపేట: రేసపువానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ మీడియా ఆఫీసర్స్ అందరు సమయాన్ని బట్టి అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య సిబ్బందిని ప్రేరణ కలగజేసే విధంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి (డీమో) బి.నాగేశ్వర రావు, ప్రాంతీయ శిక్షణా కేంద్రం మీడియా అధికారులు మొయినుద్దీన్, మురళీ, అశోక్, సూర్యకుమారి, విష్ణు పాల్గొన్నారు.

వైభవంగా పంచాయతన యాగ మహోత్సవం



యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

ఎంవీపీకాలనీ: శ్రీ సరస్వతి సహిత పంచాయతన యాగ మహోత్సవం శనివారం ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా శ్రీ శారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్ఎస్‌వీ క్లాసెస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు వి.సాయికాంత్ శర్మ దంపతులు, వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో యాగాలను నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీ సుదర్శన హవనం, హయగ్రీవ మూలమంత్ర హవనం, మండపారాధన నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పాటు పలు మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు ఆలపించిన భక్తిగీతాలు, సాంస్కృతిక నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

జేసీఐ అధ్యక్షుడిగా శ్రావణ్ కుమార్

బీచ్‌రోడ్డు: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ వాల్తేరు 46వ అధ్యక్షుడిగా నగరానికి చెందిన వేముల శ్రావణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వాల్తేర్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన జోన్ ప్రెసిడెంట్ సంతోష్ శివకుమార్ మాట్లాడుతూ జేసీఐ నూతన కార్యవర్గం మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించి, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జేసీఐను బలోపేతం చేస్తానన్నారు. ముందుగా పూర్వ అధ్యక్షుడు ప్రతాప్ కుమార్ శ్రావణ్‌కుమార్‌తో పదవీ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దొరికిన బాలురు

ఎంవీపీ కాలనీ : నక్కవానిపాలెం క్రాంతి నగర్‌కు చెందిన చాట్ల ధీరజ్ (13), చైతన్యనగర్‌కు చెందిన దత్తి యశ్వంత్ (14) అదృశ్యం ఘటన ఎట్టకేలకు సుఖాంతమైంది. ఒకే స్కూల్‌కు చెందిన వీరు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్ని రోజులుగా వీరి కోసం ఎంవీపీ పోలీసులు విస్తృతంగా గాలించగా హైదరాబాద్‌లో వీరి ఆచూకీ లభించింది. దీంతో అధికారులు వారిని పట్టుకునేందుకు ఇద్దరు పీసీలను ప్రత్యేకంగా నియమించడంతో ఎట్టకేలకు దొరికారు. వారిని విశాఖ తరలించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

రాళ్లు తేలిన రహదారులు



పాత పందులఫారం వద్ద అన్న క్యాంటీన్ ఎదురుగా ..

- పట్టించుకోని అధికారులు
- గాయాల పాలవుతున్న వాహన చోదకులు
- 9 నుంచి 13 వార్డుల పరిధిలో మరీ ఘోరం



సింహగిరి కాలనీ ఎదురుగా సర్వీస్ రోడ్డులో పైకి తేలిన రాళ్లు



విశాలాక్షి నగర్‌లో చలపతినగర్ వద్ద ..

అరిలోవ: రహదారులు రాళ్లు తేలాయి. తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ జోన్–2 పరిధి 9 నుంచి 13 వార్డుల పరిధిలో పలుచోట్ల రోడ్లు శిథిలయ్యాయి. కొన్నిచోట్ల రోడ్లు గోతులమయం కాగా మరికొన్ని చోట్ల రాళ్లు తేలిపోయాయి. దీంతో ఆ రోడ్లపై వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇక్కడ రోడ్లు గోతులు పడ్డాయి. రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీటికి రాళ్లు తేలిపోయాయి.

అన్ని వార్డుల్లో ఇదే పరిస్థితి

ఈ ప్రాంతంలో అన్ని వార్డుల్లోను ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారులు, వీధి రోడ్లతో పాటు బీఆర్‌టీఎస్‌దీ అదే పరిస్థితి కావడం విశేషం. నిత్యం ఆర్టీసీ సిటీ బస్‌లు, వీవీఐపీ, వీఐపీల వాహనాలు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలతో రద్దీగా ఉండే అడవివరం నుంచి హనుమంతవాక వరకు బీఆర్‌టీఎస్‌లో సర్వీస్ రోడ్లు గోతులు, రాళ్లు తేలిపోయి దారుణంగా మారాయి. ఈ రహదారుల్లో వాహనచోదకులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది.

- ఇక్కడ పెదగదిలి నుంచి విమ్స్ ద్వారం వరకు సర్వీస్ రోడ్డు చిత్తడి నేల మాదిరిగా తయారైంది.
- సింహగిరి కాలనీ, పాత పందులఫారం వద్ద అన్న క్యాంటీన్ ఎదురుగా బీటీ రోడ్డు పైపొర పూర్తిగా శిథిలమైంది. వర్షాలకు తారు అంతా కరిగిపోయి రాళ్లే పైకి తేలిపోయాయి. దీంతో రాళ్ల రోడ్డుపై ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయి. వాహనచోదకులు తరచూ ఈ రోడ్డుపై పడి గాయాలపాలవుతున్నారు.
- జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి అటవీ శాఖ క్వార్టర్స్ ముందు చలపతినగర్ రోడ్డుదీ అదే పరిస్థితి. ఇక్కడ రోడ్డుపై కూడా పూర్తిగా రాళ్లు తేలిపోయాయి. అటవీ శాఖ డీఎఫ్‌వో స్థాయి అధికారులు ఇక్కడ క్వార్టర్స్‌లోనే ఉంటున్నారు. వారి వాహనాలు, స్థానికుల వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది.
- జోడుగుళ్లపాలెం, ఎస్టీ, ఎస్సీ కాలనీ, సంజీవినగర్‌లలో రోడ్లు గోతులమయమయ్యాయి. జీవీఎంసీ అధికారులు స్పందించి వార్డుల్లో రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి

పెదగదిలి నుంచి హనుమంతవాక వైపు బీఆర్టీఎస్ సర్వీస్ రోడ్డు అంతా శిథిలమైంది. ఇక్కడ రాళ్లు తేలిపోవడంతో బైక్‌లు నడపలేక పోతున్నాం. ఈ రోడ్డుపై తేలిన రాళ్ల పిక్కలపై బైక్‌లు జారిపోతున్నాయి. దీంతో కిందపడి గాయాలపాలవుతున్నాం. అధికారులు ఈ రోడ్డును బాగు చేయాలి.

– వి.రవికుమార్, చినగదిలి

ఎవరూ పట్టించుకోవట్లేదు

ఈ ఏడాది కురిసిన వర్షాలకు చలపతినగర్ రోడ్డుపై గోతులు పడి రాళ్లు తేలిపోయి అస్తవ్యస్తంగా మారింది. దీనిపై నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. సుమారు నాలుగు నెలలుగా ఈ రోడ్డు ఇలానే ఉన్నా, ఇంతవరకు అధికారులెవరూ పట్టించుకోలేదు. సచివాలయంలో దీనిగురించి తెలియజేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరాం. ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదు.

– పి.శ్యామలరావు, చలపతినగర్

ఏయూలో అపూర్వ సమ్మేళనం



అపూర్వ సమ్మేళనంలో కలుసుకున్న నాటి విద్యార్థులు

విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీలో 1982 – 84 సంవత్సరంలో ఎంఎస్సీ జువాలజీ చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం వర్సిటీలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి, ప్రస్తుత అధ్యాపకులను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం డిపార్ట్‌మెంట్‌కు 3 ఏసీలు, 2 వాటర్ డిస్పెన్సర్లు బహూకరించినారు. కార్యక్రమంలో ఆచార్యులు మాధవి, జ్ఞానమణి, శ్రీరాములు, మన్మథరావు, డాక్టర్ ఫణి ప్రకాష్, సత్యనారాయణ, మోహన్ కుమార్, అనురాధ పాల్గొన్నారు.

6 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను శనివారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు, సిబ్బంది విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ సాహుల్, మోట నవీన్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా 6 కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సచ్చిదానంద సేవలు మరువలేనివి



సచ్చిదానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు

విశాఖ విద్య : పద్మ విభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి వర్ధంతి ఏయూ తత్త్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సచ్చిదానంద మూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ తత్త్వశాస్త్ర విభాగం ఆచార్యులుగా పనిచేసిన సచ్చిదానంద మూర్తి సేవలు మరువలేనివన్నారు. తత్త్వశాస్త్ర విభాగ అధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు మాట్లాడుతూ మార్చి నెలలో శత జయంతి ఉత్సవాల నిర్వహణకు ఐసీపీఆర్ నిధులు సమకూర్చనుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఆచార్యులు కృష్ణయ్య, ఆచార్య బసవ రాజు సిద్ధాశ్రమ, అధ్యాపకులు డాక్టర్ దేవదానం, డాక్టర్ ముసుగు ప్రసాద్, డాక్టర్ వీరబాద్రరావు, డాక్టర్ రాజమాణిక్యం విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



అవగాహన ర్యాలీలో ఏయూ రిజిస్ట్రార్, ఆచార్యులు

విశాఖ విద్య : స్వర్ణాంధ్రప్రదేశ్ – స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సంకల్పంలో భాగంగా శనివారం ఆంధ్ర యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని వివిధ విభాగాల పరిసరాలను ఏయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుభ్రం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు పాల్గొని విద్యార్థులతో కలిసి విద్యాలయ ప్రాంగణాలను శుభ్రపరిచారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ప్లాస్టిక్‌ను ఏరివేద్దాం – పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.నరసింహారావు, శానిటేషన్ విభాగం డీన్ ధనరాజ్, ఏయూ ఎన్ఎస్ఎస్ కేంద్ర డైరెక్టర్ ఆచార్య హరనాథ్ పాల్గొన్నారు.

ఏయూలో చదువుకోవడం గొప్ప అనుభూతి

- లియోన్ దేశ అంబాసిడర్ రషీద్



వర్సిటీ అధికారులు, విద్యార్థులతో కేక్ కట్ చేస్తున్న రషీద్

విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకోవడం గొప్ప అనుభూతి అని సియెరా లియోన్ దేశ అంబాసిడర్ (యు.ఏ.ఇ) రషీద్ సిసే అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న సియెరా లియోన్ విద్యార్థులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యు.ఏ.ఇలో అనేక విశ్వ విద్యాలయాల్లో పర్యటించానని, కానీ ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. ఏయూలో చక్కటి వసతులు, మంచి వాతావరణం ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ చదువుతున్న తమ దేశ విద్యార్థులు ఉత్తమ విలువలు సైతం నేర్చుకోవడం వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న సియెరా లియోన్ దేశ విద్యార్థులతో కలిసి స్టూడెంట్ యూనియన్ బాడీని ప్రారంభించారు. యూనియన్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు మాట్లాడుతూ రషీద్ సిసే ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం సంతోషకరమన్నారు. ఏయూలో 58 దేశాల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఆఫ్రికా దేశాల నుంచి సుమారు 700 మంది విద్యార్థులు ఉండటం మరో విశేషమన్నారు. ఇప్పటికే వర్సిటీలో అమెరికన్ కార్నర్ ఉందని, వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్‌ను సైతం పూర్తి స్థాయిలో నెలకొల్పబోతున్నామని తెలిపారు. విదేశీ విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్ కల్పనే ఆంధ్ర విశ్వ విద్యాలయం లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం రషీద్ సిసేను సత్కరించారు.

బాలికల గృహాన్ని సందర్శించిన న్యాయమూర్తి



బాలికల గృహంలో సీడబ్ల్యూసీ సభ్యులతో సమావేశమైన సివిల్ జడ్జి వెంకటశేషమ్మ

అరిలోవ: ప్రభుత్వ బాలికల గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ శనివారం సందర్శించారు. ఇటీవల ఇక్కడ ఐదుగురు బాలికలు తమను ఇళ్లకు పంపించేయాలని చేసిన డిమాండ్లు, హడావుడిపై ఆమె ఆరా తీశారు. బాలికలు క్రమశిక్షణతో మెలగాలని హితవు పలికారు. బాలికలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని గృహం అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రసన్న, సీడబ్ల్యూసీ సభ్యులు, గృహం సూపరింటెండెంట్ ఎ.వి.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి



ఎంవీపీ రైతు బజార్‌లో స్టాల్ నిర్వాహకుడి గుర్తింపు కార్డు పరిశీలిస్తున్న అధికారి యాసిన్

అరిలోవ: రైతు బజార్లలో రైతులకు గుర్తింపు కార్డ్‌లు తప్పనిసరి అని వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ అన్నారు. ఎంవీపీ రైతుబజార్‌ను శనివారం సందర్శించిన ఆయన రైతులు, వ్యాపారుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్టాళ్లు పొందినవారు గుర్తింపు కార్డు దగ్గర పెట్టుకొని విక్రయాలు జరపాలన్నారు. రైతు బజార్‌లో కాయగూరల స్టాళ్లు, కిరాణా షాపులను పరిశీలించారు. డ్వాక్రా, పీహెచ్‌సీ వారి స్టాళ్లను తనిఖీ చేశారు. అన్ని షాపుల వద్ద ధరల పట్టికలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. రైతు బజార్ ప్రకటిస్తున్న ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. సందర్శనలో రైతుబజార్ ఈవో వరహాలు, సహాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించేలా తోడ్పాటు



విద్యార్థినులకు అభినందనలు తెలుపుతున్న వీసీ శశిభూషణరావు, ఆచార్యులు

విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించేలా తోడ్పాటు అందిస్తామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించిన కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ కేంద్రం తరపున పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకున్న ఫార్మసీ కళాశాల, లా కళాశాల విద్యార్థినులు సృజన, హర్షితకు వీసీ శుభాకాంక్షలు తెలిపారు. ఏయూ విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి వర్సిటీకి పేరు తీసుకురావడం సంతోషకరమన్నారు. ఏయూ ఎన్ఎస్ఎస్ కేంద్రం తరపున ఈ ఇద్దరు విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో నిర్వహించే సదస్సులో పాల్గొనే అవకాశాన్ని పొందారని కేంద్రం సంచాలకులు ఆచార్య హరనాథ్ తెలిపారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాదిరాజు ప్యాలెస్‌లో గ్రాండ్ ట్రేడ్ ఫెయిర్ ప్రారంభం



ట్రేడ్ ఫెయిర్‌లో ఉత్పత్తులను పరిశీలిస్తున్న సందర్శకులు

ఎంవీపీకాలనీ: ఐఐజీటీఎఫ్ ఆధ్వర్యంలో భారత అంతర్జాతీయ గ్రాండ్ ట్రేడ్ ఫెయిర్ ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా శనివారం ప్రారంభమైంది. భారత ఛాంబర్ ఆఫ్ కామర్స్ (బీసీసీ), పలు మార్కెటింగ్ సర్వీస్ సంస్థలు ఈ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు సీసీజీ మార్కెటింగ్ అండ్ సర్వీసెస్ సంస్థ సీఈవో చందన ముఖర్జీ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఈ గ్రాండ్ ఫెయిర్ కొనసాగుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫర్నిచర్, దుస్తులు, జ్యువెలరీ, ఇంటీరియర్, లెదర్, జీవనశైలి ఉత్పత్తులు, హ్యాండీ క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్, జ్యూట్ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఫెయిర్‌లో 5 దేశాలతో పాటు 15 రాష్ట్రాలకు చెందిన సంస్థలు వాటి ఉత్పత్తులను ప్రదర్శించి, విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పలు ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు మలేరియా పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

అరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు మలేరియా విభాగం అధికారులు శనివారం రక్త పరీక్షలు చేశారు. ఎంపీహెచ్‌వో శేషబాబు ఆధ్వర్యంలో పిఠాపురం సబ్ యూనిట్ సిబ్బంది ఇక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులు సుమారు 400 మందికి రక్త పరీక్షలు చేశారు. వారిలో ఓ విద్యార్థికి మలేరియా పాజిటివ్ రావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆ విద్యార్థికి మందులు అందించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, మలేరియా విభాగం సూపర్‌వైజర్లు రఘు, కుమార రవి, మురళి, శ్రీను, దుర్గారావు, రాజేష్, రమణ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



ఏయూ విశ్రాంత ఆచార్యులు జయప్రదను సత్కరిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం : డాక్టర్.వి.ఎస్.క్రిష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ బాబు మాట్లాడుతూ భారతదేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. ఏయూ విశ్రాంత ఆచార్యులు సి.ఎల్.ఎల్.జయప్రద మాట్లాడుతూ గతంలో మహిళలు దేవదాసీలుగా ఉండి ఉన్నత శిఖరాలను ఎలా చేరుకున్నారో వివరించారు. మహిళా సాధికారత సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కుసుమకుమారి మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు, ఆరోగ్యం, విద్య సామాజిక ఎదుగుదల అంశాలపై వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ నాటి మహిళలు ఉన్నత శిఖరాలను ఎలా చేరుకున్నారో తెలియజేశారు. అనంతరం ఏయూ విశ్రాంత ఆచార్యులు జయప్రదను సత్కరించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ రూపవాణి, డాక్టర్ జి.సుభాషిణి, డాక్టర్ శాంతి, డాక్టర్ రమ్య, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

జీవిత బీమా.. మరింత ధీమా



5కే రన్‌లో ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు

విశాఖ సిటీ: ప్రతి ఒక్కరికీ జీవిత బీమా అవసరమని ఆంధ్రా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తెలిపారు. సంకల్ప యాత్రలో భాగంగా టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ వైజాగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి 5 కిలోమీటర్ల రన్ నిర్వహించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ జెండా ఊపి సంకల్పయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో బీమా అవసరం ఉందని, అందరూ తీసుకోవాలని సూచించారు. ఈ రన్‌లో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఏజెన్సీ రాజీవ్ లబాల, బ్రాంచ్ మేనేజర్ కృష్ణ సుదీర్, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, పృథ్వీరాజ్, సీనియర్ లీడర్ జగన్నాథ్ కావలి పాల్గొన్నారు.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకుందాం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న క్రిష్ణా జూనియర్ కళాశాల అధ్యాపకులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : అందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.క్రిష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్రిష్ణారావు, వేదవ్యాస్, ఆర్.పి.నాయుడు పాల్గొన్నారు.

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సంస్థ సమావేశ మందిరంలో మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జాతీయ ఓటర్ల దినోత్సవం – 2025ను శనివారం డాక్టర్ వీఎస్ క్రిష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు మాట్లాడుతూ ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉన్నందున వారిని ఓటింగ్ వైపు ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.సునీత పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ ఫణి రామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటరూ బాధ్యతగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు పి.ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, జి.వి.ప్రతాప్, బి.నాగేశ్వరరావు, తహసీల్దార్ పాల్ కిరణ్, యూబీఏ కో ఆర్డినేటర్ డాక్టర్.ఎస్.వి.రామారావు, వైఆర్‌సీ కో ఆర్డినేటర్ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు